## ' క్రియ ' పిల్లల పండుగ (2015) – పద్యధారణపోటీ (సబ్‌జూనియర్‌స్థాయివిద్యార్థులకు)
## కంఠస్థపద్యములు

సూచనలు:–ఉచ్చారణ స్పష్టంగా ఉండాలి. ఒత్తులు, దీర్ఘాలు చక్కగా పలకాలి.రాగయుక్తంగా పాడిన పద్యాలకు అధికప్రాధాన్యత ఉండదు.క్రిందిపద్యాలలో న్యాయ నిర్ణేతలు వారికి తోచిన కొన్నిపద్యాలు అడుగుతారు.

---

1.ధనమును విద్యయు వంశం
బును దుర్మతులకు మదంబు పొనరించును స
జ్జనులైనవారి కడకువ
యును వినయము నివియతెచ్చు నుర్వీ నాథా.

2.కోపము నుబ్బును గర్వము
నాపోవక యునికియును దురభిమానము ని
ర్వ్యాపారత్వము నను నివి
కాపురుష గుణంబులంద్రు కౌరవనాథా.

3.ఒరులేయవి యొనరించిన
నరవర అప్రియము తన మనంబునకగు తా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మపథములకెల్లన్.

4.తగినవేషంబు తనుదాను పొగడుకొనమి
నొచ్చియును కీడు వలుకమి యిచ్చి వగవ
కునికి తనకెంత నడవకయున్న పథము
తప్పకుండుట నడవడి కొప్పుసేయు.

5.తనువున విరిగిన యలుగుల
ననువుగ బుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె యధిపా.

6.అనువు గాని చోట యధికులమనరాదు
కొంచముండుటెల్ల కొదువ కాదు
కొండ అద్దమందు కొంచమైయుండదా
విశ్వదాభిరామ వినుర వేమ.

7.అంతరంగమందు అపరాధములు చేసి
మంచివానివోలె మనుజుడుండు
ఇతరులెరుగకున్న ఈశ్వరుడెరుగడా
విశ్వదాభిరామ వినుర వేమ.

8.నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తళుకుబెళుకు రాలు తట్టెడేల
చదువ పద్యమరయ చాలదా యొక్కటి
విశ్వదాభిరామ వినుర వేమ.

9.బహుళకావ్యములను పరికింపగా వచ్చు
బహుళశబ్దచయము పలుకవచ్చు
సహనమొక్కటబ్బ చాల కష్టంబురా
విశ్వదాభిరామ వినుర వేమ.

10.కోపమునను ఘనత కొంచమై పోవును
కోపమునను మిగుల గోడు గల్గు
కోపమడచెనేని కోరిక లీడేరు
విశ్వదాభిరామ వినుర వేమ.

11.మొదల జూచిన కడుగొప్ప పిదప గురుచ
ఆది కొంచము తరువాత నధికమగుచు
తనరు దినపూర్వ పరభాగ జనితమైన
ఛాయపోలిక కుజనసజ్జనుల మైత్రి.

22.తరువులతిరస ఫలభార గురుత గాంచు
నింగి వ్రేలుచు నమృతమొసంగు మేఘు
డుద్ధతులు గారు బుధులు సమృద్ధిచేత
జగతి నుపకర్తలకు నిది సహజగుణము.

13.వినదగు నెవ్వరు చెప్పిన
విని నంతనె వేగపడక వివరింపదగున్
కని కల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ.

14.తన కోపమె తనశత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ.

15.పాపపు పని మది దలపకు
చేపట్టినవారి విడువజేయకు, కీడున్
లోపల దలపకు, క్రూరుల
ప్రాపును మరి నమ్మబోకు రహిని కుమారా.

16.వగవకు గడచినదానికి
పొగడకు దుర్మతులనెపుడు పొసగని పనికై
యొగి దీనత నొందకుమీ
తగ దైవగతిం బొసంగు ధరను కుమారా.

17.సరకులయెడ జాగ్రత్తయు
చురుకు పనులయందు,భక్తి సుజనులయందున్
కరుణ యనాథులయెడలం
తరుణికి జెలువారవలయు ధరణి కుమారీ.

18.తెలుగుతనమువంటి తీయందనములేదు
తెలుగుకవులవంటి ఘనులు లేరు
తెలుగుతల్లి సాధుజనకల్పవల్లిరా
లలితసుగుణజాల తెలుగుబాల.

19.దొరలు దోచలేరు దొంగలెత్తుకపోరు
భ్రాతృజనము వచ్చి పంచుకోరు
విశ్వవర్ధనంబు విద్యాధనంబురా
లలితసుగుణజాల తెలుగుబాల.

20.స్వేచ్ఛ యన్నచో యథేష్టవర్తన కాదు
నిక్కమైన స్వేచ్ఛ నియతి గలదె
నియతిలేని స్వేచ్ఛ నిప్పుతో చెర్లాట
వాస్తవమ్ము నార్లవారి మాట.